ఆశీర్వదిస్తే ఐదేళ్లు సేవ చేస్తా..


గూడూరులో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు


తొర్రూరు డివిజన్ కేంద్రంలో వాకర్స్‌తో ఎర్రబెల్లి దయాకర్‌రావు

- కాంగ్రెస్‌వి వారంటీ లేని గ్యారంటీలు
- బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: ఆశీర్వదిస్తే మరో ఐదేళ్లు ప్రజాసేవ చేస్తామని బీఆర్‌ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. డివిజన్ కేంద్రంలో యతిరాజారావు పార్కులో ఆదివారం ఆయన వాకర్స్‌ను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం వారితో సరదాగా వాలీబాల్ ఆడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కే ఓటు అడిగే హక్కు ఉందని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించేందుకు సిద్ధమైందన్నారు. కాంగ్రెస్ పార్టీవి వారంటీ లేని గ్యారంటీలు అని దుయ్యబట్టారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే మూడు గంటల కరెంట్, ఏడాదికో ముఖ్యమంత్రి మారడం గ్యారంటీ అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ సీఎం కేసీఆరే అన్నారు. నియోజకవర్గానికి డాలర్లతో గెస్టులు వస్తున్నారని, వారికి తగు రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నో అభివృద్ధి పనులు చేశా..

పాలకుర్తి: నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పనులు చేశానని ఇంకా చేయాల్సినవి ఉన్నాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలో శాతపురం, ఈరవెన్ను, బమ్మెర, గూడూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రితో పాటు ఆయన సతీమణి ఉషాదేవి పాల్గొని మాట్లాడారు. తాగు, వ్యవసాయానికి నీరు, 24 గంటలు విద్యుత్, రోడ్లు, పాఠశాలలకు నిధులు, వల్మిడి, బమ్మెర, పాలకుర్తిలో నిధులు మంజూరి చేసి కవులు, కళాకారుల నిలయాలుగా మార్చడం జరిగిందని అన్నారు. నిరుద్యోగులకు ఎర్రబెల్లి ట్రస్టు ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేయడంలో మన నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎర్రబెల్లి ఉషాదేవి

మరిన్ని సదుపాయాలు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజలకు మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కల్పన జరుగుతుందని మంత్రి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నాగారం ఏరియాలో ఉన్న శివసాయి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అయ్యప్ప క్వార్టర్స్ వారి బ్రోచర్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దయాకర్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానుల సమావేశం జరిగింది.


కొడకండ్ల: బీఆర్‌ఎస్‌లో చేరిన బెస్ట్‌ఫ్రెండ్స్ సభ్యులు

బీఆర్‌ఎస్‌లో చేరిక

కొడకండ్ల: మండల కేంద్రానికి చెందిన బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఆసీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సంస్థ నిర్వాహకులు అరుణ్‌గోపాల్, కొండ్రాతి నరేష్, చిలుసాని రవి, చెరుకు సంధ్యారాణి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఎర్రబెల్లి తరఫున ప్రచారం

పాలకుర్తి టౌన్: మంత్రి దయాకర్‌రావు తరఫున ఆదివారం మండల కేంద్రంలోని 51వ బూత్‌లో మాజీ సర్పంచ్ కమ్మగాని ఆంజనేయులు, నాయకులు నాగేశ్వర్, చక్కు పరమేశ్వర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కమ్మగాని సారయ్య, వెంకన్న, రాములు, మామిండ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగం పరిశోధకుడు రామిశెట్టి శ్రీనివాస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆగ్రో ఎకనామిక్ కండిషన్స్ ఆఫ్ ట్రైబల్స్ ఇన్ తెలంగాణ స్టేట్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు యానాది అండ్ ఎరుకల కమ్యూనిటీస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రామిశెట్టి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రాధాకృష్ణ పర్యవేక్షణలో శ్రీనివాస్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.



ప్రత్యేక అలంకరణలో మల్లన్న

కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని మహాదేవుడిని భక్తులు ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో మల్లన్నకు అభిషేకాలు, అర్చనలు జరిపించారు.

పరకాల రూపురేఖలు మారుస్తా..


చల్లాకు మంగళహారతి, వీరతిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు


ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

- మూడోసారి అవకాశం ఇవ్వండి
- కాంగ్రెస్, బీజేపీకి ఓటమి ఖాయం
- వాడ వాడల మంగళహారతులు, బోనాలతో స్వాగతం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి

పరకాల: పరకాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న తనకు మూడోసారి ఎమ్మెల్యేగా పనిచేసే అవకాశం కల్పిస్తే పరకాల రూపురేఖలు మారుస్తానని పరకాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఏ ఊరు.. ఎక్కడ ఉంటుందో కూడా తెలియకుండా ఎన్నికలప్పుడు మాత్రం ప్రజల మధ్యలోకి అవకాశవాద రాజకీయాల కోసం వచ్చే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పరకాల మున్సిపల్ పరిధిలోని పరకాల బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి వార్డుల వారీగా వాడవాడకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు బోనాలు, వీర తిలకం దిద్ది మంగళహారతులతో మహిళలు స్వాగతం పలికారు. అనంతరం సీఎస్ఐ చర్చివద్ద, మార్కెట్ చౌరస్తా వద్ద ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ అంటే దళిత గిరిజన వ్యతిరేక పార్టీ అని బీఆర్‌ఎస్ అంటేనే దళిత గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన పార్టీ అన్నారు. గిరిజనులపై ప్రేమ ఉంటే తండాలను పంచాయతీలుగా కాంగ్రెస్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ 10వేల ఉద్యోగాలు 10 ఏళ్లలో కేసీఆర్ సర్కార్ లక్ష10వేల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. 30ఏళ్ల క్రితం పరకాల రెవెన్యూ డివిజన్‌ను తరలిస్తే పట్టించుకునే నాథుడే లేడని, కానీ కేసీఆర్ పరకాల ప్రజల ఆవేదనను అర్థం చేసుకొని రెండు కొత్త మండలాలతోపాటు మళ్లీ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరకాల ప్రజల చిరకాలవాంఛ 100 పడకల ఆస్పత్రి నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో పరకాల పట్టణ ప్రజలు తాగునీటి కోసం నానా కష్టాలు పడేవారని, నేడు మిషన్ భగీరథతో అలాంటి కష్టాలు పోయాయని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంగెం మండలం చింతలపల్లి వద్ద 1,350 ఎకరాల్లో ఏర్పాటు చేసిన మెగా కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ ద్వారా లక్ష మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఏ ఊరో తెలియని రేవూరి, గత ఎన్నికల్లో 5,260 ఓట్లతో డిపాజిట్ రాని బీజేపీ తనను ఓడించడం అసాధ్యమన్నారు. తరలివస్తున్న ప్రజలు, మద్దతుగా నిలుస్తున్న వారిని చూస్తుంటే ఖచ్చితంగా గతంలో కంటే బ్రహ్మాండమైన మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నిప్పాని హైమావతి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

పరకాల పట్టణ మైనార్టీ నాయకుడు మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, పరకాల రాయపర్తి గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ తిప్పర్తి రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు చెలుక్ల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అదే విధంగా కొకొండ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ముక్కెర మొగిళి, ముక్కెర రవి, మాడిశెట్టి శోభన్ బీఆర్‌ఎస్‌లో చేరారు. నడికూడ మండలం ధర్మారం, కంఠాత్మకూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ 15వ డివిజన్ గొర్రెకుంట గ్రామానికి చెందిన యువచైతన్య యూత్ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో 300 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు.

చల్లాకు మద్దతు

పరకాల పట్టణంలోని స్వర్ణకారుల సంఘం నాయకులు, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ గుమాస్తా సంఘం నాయకులు, మాల, మేర కుల సంఘం నాయకులు, పరకాల మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి మద్దతు తెలిపారు.


నడికూడ: బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

బీఆర్‌ఎస్‌తోనే యువతకు భవిష్యత్

నడికూడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే యువతకు బంగారు భవిష్యత్ అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జవ్వాజి ప్రవీణ్ కుమార్, కామేంద్రి ప్రభాకర్, మండలంలోని ధర్మారం, కంఠాత్మకూర్, రాయపర్తికి చెందిన వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు, జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ధర్మారెడ్డి గెలుపుకోసం దామెరలో ప్రచారం

దామెర: మండల కేంద్రంలో చల్లా ధర్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ రైతు బంధు మండల కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందని గడపలేదని అన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే చల్లా ధర్మారెడ్డి కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, నాయకులు దామెరుప్పు శంకర్, మేరుగు సంతోష్, ఆనందం, కృష్ణ, బత్తిని పెద్ద రాజు, సుమన్ భిక్షపతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల చేయూత

మడికొండ: 45వ డివిజన్ తరాలపల్లి గ్రామానికి చెందిన అమ్మగారి రమేష్ టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తుండేవాడు. రెండు నెలల క్రితం అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. దాంతో బాధిత కుటుంబానికి మృతుడి చిన్ననాటి స్నేహితులు రూ.55,500లను పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్‌ను కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వేల్పుల సాంబరాజు, కన్ని, వేణు, నవీన్‌కుమార్, మలిశెట్టి రాధాకృష్ణ, మాచర్ల క్రాంతికుమార్, స్థానికులు పాల్గొన్నారు.


మృతుడి కుటుంబ సభ్యులకు డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న మిత్రులు

బీఆర్‌ఎస్ పార్టీ కాదు.. ఒక కుటుంబం


వరంగల్ : ఏనుమాములలో ప్రచారం చేస్తున్న రమేశ్


హసన్‌పర్తి: గడపగడపకు ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్

వరంగల్: బీఆర్‌ఎస్ అంటే పార్టీ కాదని, ఒక కుటుంబం అని ఆ పార్టీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. కాంగ్రెస్ నీచ రాజకీయాలకు చరమగీతం పాడే రోజు దగ్గర పడిందని అన్నారు. గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన, మాజీ కార్పొరేటర్ సారయ్యను కాంగ్రెస్ నాయకులు ప్రలోభాలకు గురిచేసి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేర్పించారు. అరూరి రమేష్ సమక్షంలో ఆదివారం మళ్లీ వారు సొంత పార్టీలో చేరారు. ఈ క్రమంలో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తమ ఓటుతో సరైన బుద్ధి చెబుతారని, బీఆర్‌ఎస్ నాయకులను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

14వ డివిజన్‌లో ప్రచారం

14వ డివిజన్‌లో ప్రచారం చేపట్టిన రమేశ్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో సన్మానించారు. డివిజన్‌లో ఏనుమాముల, సుందరయ్యనగర్, ఎన్టీఆర్‌నగర్, మణికంఠ కాలనీల్లో ప్రచారం నిర్వహించగా, మహిళలు బతుకమ్మలతో రమేశ్‌ను స్వాగతించారు. మహిళలతో కలిసి రమేష్.. బతుకమ్మ, కోలాటం ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలతో తన గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింహ, రాజశేఖర్, పత్రి సుభాష్ పాల్గొన్నారు.


పర్వతగిరి : అరూరికి మద్దతు తెలుపుతున్న ముదిరాజ్ కులస్తులు

'అరూరి' గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

వర్ధన్నపేట: వర్ధన్నపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేశ్ గెలుపు కోసం ఆదివారం పట్టణంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, నాయకులు సిలువేరు కుమారస్వామి, గోధుమల మధుసూదన్, కౌన్సిలర్ మంచాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని గతంలో ఏ పార్టీ, ఏ నాయకుడు చేయలేని అభివృద్ధి కేవలం పదేళ్ల కాలంలో చేసి చూపించిన ఘనత ఎమ్మెల్యే అరూరికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల సీజన్‌లో వచ్చి పోయేవారు మాత్రమే అని అరూరి ప్రజల కష్ట సుఖాల్లో ఎల్లప్పుడు పాల్గొంటారన్నారు.

1వ డివిజన్‌లో

హసన్‌పర్తి: అరూరి రమేశ్ గెలుపు కోరుతూ నాయకులు శనివారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. నగరంలోని 1వ డివిజన్ నారాయణనగర్, మంత్రపురి కాలనీల్లో ప్రచారం సాగింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మూల దేవేందర్, నంది శ్రీనివాస్, చకిలం చంద్రశేఖర్‌రావు, ఇరుకుల లక్ష్మణ్, దుబ్బల భాస్కర్, శ్రీకాంత్, కోడెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, నాయకులు పెద్దమ్మ శ్రీనివాస్, అర్జున్, గిన్నారపు రవీందర్, జన్ను కిషన్ పాల్గొన్నారు.


వర్ధన్నపేట : ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అరూరికి ముదిరాజ్ కులస్తుల మద్దతు

పర్వతగిరి: మండలంలోని కొంకపాకకు చెందిన ముదిరాజ్ కులస్తులు అరూరి రమేశ్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ మేరకు హన్మకొండ ప్రశాంత్ నగర్‌లో అరూరిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయన విజయానికి కృషి చేస్తామని తెలిపారు. యుగేందర్‌రావు, మోహన్‌రావు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దుర్గయ్య, ఉపాధ్యక్షుడు రాజు, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి


చెన్నారావుపేట: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి


గజమాలతో సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- బీఆర్‌ఎస్ నర్సంపేట అభ్యర్థి పెద్ది

చెన్నారావుపేట: అన్ని రంగాల్లో గ్రామాలను అభివృద్ధి చేశానని బీఆర్‌ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జల్లీ, ఎల్లాయగూడెం, పదహారుచింతల్, చెరువుకొమ్ము తండా, బోడ మాణిక్యం తండా, శంకరం తండా, బాపునగర్, కందిగడ్డ తండా, తోపనగడ్డ తండా, లింగగిరి గ్రామాల్లో రెండోవిడత ప్రచారం ఆదివారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు గజమాలలతో సన్మానించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తీర్పు ఏకపక్షంగా చెన్నారావుపేట మండల ప్రజలు ఇవ్వనున్నారని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, రైతు వేదిక, పల్లె దవాఖాన, కమ్యూనిటీ హాళ్లు, మహిళ సంఘాలకు భవనాలు ఇచ్చానని, జిల్లాలో ఎక్కడలేని విధంగా అభివృద్ధి చేశానని అన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ రాయిడి రవీందర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కంది కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, బుర్రి తిరుపతి, బాల్నె వెంకన్న, తూటి శ్రీనివాస్, కేతిడి వీరారెడ్డి, జక్క అశోక్, చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ, మురహరి రవి, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



నర్సంపేట: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన ఆదివారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులను అరికట్టాలి

నర్సంపేట: ఆడపిల్లలపై జరిగే లైంగిక, ఇతర వేధింపులను సమాజంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి నిర్మూలన కోసం పాటు పడాలని స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని విజ్‌డమ్ పాఠశాలలో ఆదివారం ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సహకారంతో స్వయం కృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు ధైర్యంగా సమస్యలను ఎదురించే స్థాయికి ఎదగాలన్నారు. ఆడపిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు ఉంటాయని హెచ్చరించారు. ఆడపిల్లలు వేధింపుల సమస్యలకు గురైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ 100 టోల్ ఫ్రీ నంబర్స్‌కు ఉచితకాల్ ద్వారా సమాచారం అందించి సహాయం తీసుకొని రక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ సయ్యద్ జావిద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, ఉపాధ్యాయులు, హాస్టల్ బాలికలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బెజ్జంకి ప్రభాకర్

డిసెంబర్ 3 తర్వాత సీఎం కేసీఆర్ ఇంటికే

- బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

గీసుకొండ: డిసెంబర్ 3 తర్వాత సీఎం కేసీఆర్ ఇంటికే అని, మళ్ళీ ఆ ప్రభుత్వం రాదని, రాష్ట్రంలో కాషాయ జెండా ప్రభుత్వం రావడం తథ్యమని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని వరంగల్-నర్సంపేట రహదారిపై బీజేపీ పరకాల అభ్యర్థి డాక్టర్ కాళీప్రసాద్ గెలుపు కోసం రోడ్‌షో నిర్వహించిన సందర్భంగా ఊకల్ క్రాస్ రోడ్డు వద్ద ఆయన మాట్లాడారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో కమలాపూర్ మండల ఇన్‌చార్జిగా ఉన్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అంబాలలోని సరస్వతీ నిలయంగా ఉండాల్సిన ఆయన ప్రైవేట్ స్కూల్‌ను తాగుబోతుల అడ్డాగా మార్చారన్నారు.


రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

సంగెం: రైతులు పండించిన వరి ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఏఈఓ లావణ్య అన్నారు. ఆదివారం కాపులకనిపర్తి సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని కాపులకనిపర్తి, గవిచర్ల, షాపూర్, తీగరాజుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారీ వ్యవస్థను అరికట్టి మద్దతు ధరలు అందించేందుకే సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు ధాన్యంను నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర క్వింటాల్‌కు ఏ గ్రేడ్‌కు రూ 2,203లు, కామన్ రకానికి రూ 2,183లు పొందాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ రమణాచారి పాల్గొన్నారు.

